# తిరపతి గంగమ్మజాతర

''ఈ జాతర ఎప్పుడు కొళ్లపోబోతిందో ఏంపాడో? కొంపలో అట్టా కుదురుగా కూసుందామని ఆశే లే. ఈ తలుపు తీసేదానికీ యేసేదానికే సరిపోతావుండాది బతుకు. ఆడెవుడో పంగలేనోడు పిల్లితలకాయి గొరిగినట్టు!''

టవును బ్యాంకీ ఎలక్సన్లు. ఒగిటికి తక్కువగా డెబ్బయిమంది కరువో కాలమో అని కాసడు బూసడు నామినేషన్లు దాకల్ చేసినారంట. వాళ్ల మల్లా గ్రూపులు కట్నారు. గ్రూపులు గ్రూపులుగా ప్రెశారానికి ఊరిమింద పణ్ణారు!

''బోగం యీది కొళ్లబోతావుంటే బోడి సన్నాసులంతా ఎగబెట్టుకోని పరిగెత్తిన కతగా ఉండాదే?'' అంటా ఆ నాలుగ్గాళ్లమండపం కాడ నలుగురు నాలుగిదాలుగా అంటానే ఉండారు. ఈళ్ల యింటానే ఉండారు.

అయినా యాళాపాళా ఏమీ చూసేదిలే. ఏయరవకాడంటే ఆయరవకాడ నిన్ను బట్టు నన్నుబట్టు అంటా ఎలబారేది. ఇంటింటికీ పొయ్యేది. తలుపు తట్టేది. తలుపు తీస్తానే అది ఆడదైనా సరే! మొగోడైనా సరే! మలేసుకుణ్ణెట్టు చుట్టూరా చుట్టుకుండేది. ఒకడు దణ్ణం పెడ్తావుంటే... యింకొకడు కాగితాలిస్తావుంటే-

''నాదేమో గుర్రం... వాడిదేమో ఒంటె... యిద్దో ఈడిది గాడిది! మర్సి పోబాకండమ్మా. మీ యింటాయన గూడా లేనట్టుగా ఉండాదే. అయనతో గూడా ఒక మాట మర్సి పోకుండా చెప్పు. అయినా ఈడికే అయ్‌పోలేదులే. మేమంతా మల్లా వస్తా ఉంట్లా!'' అంటా ఒక జాతర చేస్తారు.

ఆ గ్రూపు అట్టా గడపదాట్తానే యింకొక గ్రూపు. ఇట్టా మాదిర ఒకరు పోతానే యింకొకరు వచ్చొచ్చి తలుపు తట్తావుంటే తలుపుతీసి మల్లా తీసిన తలుపు యేసేదానికి మాబాశాలి యాష్టపోతా ఉండాది.

''తలుపు మూసేదెందుకు? తీసేదెందుకు? అట్నే తెర్సి పెటేస్తే పోలా?''

''వాళ్ల జాతర ఎట్టున్నా పోనీ. ఈ కొంపలో నీ జాతర జాస్తి అయ్‌పాయనే. నీ మాట యినుకోని తలుపు అట్నే తీసిపెట్టేస్తే యింక అంతే కత. నీ పాటికి నువ్వు పోతావ్. మిద్దిమింద కొలువు తీర్తావ్. నా బతుకు ఆ పొయ్యికాణ్ణే రగలబడి పోతింది. దోవన పోతా పోతా

వాడెపుడైనా అట్టా యిట్టా చూసి లోపలకి దూరి దొరికింది శాతపట్టుకోని పోతే?''

''అప్పిటికి యిదేం ఊరా? అడివా?''

''ఎట్టమ్మా ఈ అడివి మణిసితో? అది సరేగదా? ఊళ్లో కుదురుగా ఉండి కుప్పకొట్టా ఉంటే యిక్కన పక్కన ఏం జరగతా ఉండాదో తెలిస్తింది. నిన్న గాక మొన్న ఆ ఆకుతోట యీదిలో పట్టపాగులే ఏం జరిగిందో తెల్సునా? పోనీ! ఆ ముందటాన్నాడు సందేళ కాడ కస్తూరిబాయి సందులో గెంటసేపు కరంటు లేకుండా బోతే...''

''నీ జాతర పెద్ద జాతరగా ఉండాది గదే?''

''నీది జాతర నాది జాతరని యిట్టా జుట్లు జుట్లు పట్టుకోని కూసుంటే...''

''ఉండేదంతా ఉండంగా జుట్లే పట్టుకోని కూసుందామా?''

''ఇద్దో పాగులే ఈ వగలు... ఈ వగలే గదా వద్దనేది?''

''నగల్లేకుండా పాయ్‌నా బతకొచ్చుగానీ... బతుకులో వగలులేకుండా...''

''ఎట్టమ్మా ఈ వగాతగా రొండూలేని మొగోడితో?''

''వగలు వద్దంటావు. వగాతగా లేదంటావు. ఎట్నే నీతో ఏగులాడేది?''

''ఏగేది. వాగేది. రొండూ వద్దులే. వాడు నీ కొడుకు కొంప కొస్తే యింకా పెద్ద జాతర చేస్తాడు. ముందుగా నువ్వు తెవులు. తెమిలి వాడి కతేందో కనుక్కో!''

కడవడంత గుమ్మిడికాయ అయినా కత్తి పీటకు లోకవేనంట!

నలుగుర్కైనా పాడేగదా నాగ్గూడా! అందుకే తెగేదాకా లాగేదెందుకని ఎలబార్తి. గడప దాట్తి. ఈదిలో నిలబడ్తి. ఎట్ట పోవాలనుకుంటా అట్టా యిట్టా చూస్తి. ఎందుకైనా మంచిది ఎగబడి పోదామని పోతావుండా.

తిరపతిలో గంగమ్మ ఎలబారి పాయ్ రొండు వారాలైపాయ. అయినా యీదుల్లో ఆశాక యింకా వదిలిపోలా. పిల్ల నాయాండ్లు యింకా తప్పుడు కూతలు కూస్తానే వుండారు. ఇంట్లో జాతర పల్లేక యీదిలో పడ్తే ఈ పిల్లనాయాండ్లతో పడేది ఒక జాతరగా ఉండాది.

''తిరపతిలో గంగమ్మ ఎలబారి పాయ్యేదేంది! వస్తేనే గదా ఎలబారి పాయ్యేదానికి. వచ్చేదేంది? పాయ్యేదేంది? పిల్లనాయాండ్లు తప్పుడు కూతలు కూసేదేంది?'' అని అనుమానం పడ్తా ఉండారుగదా? అనుమానం పాణ సంగటం. ఎందుకంత బాద? అదే చెప్తా యినండి. ఈ సీమలో ఉండే జిల్లాల్లో చిత్తూరు జిల్లా వొగిటి. ఈ జిల్లాలో ఒక మాట ఉండాది. అదేమంటే? – రాయల చెరువంత చెరువు... పులిగుండంత గుండు... పేరూరు బండంత బండ– ఈ యిలాకాలో లేనేలేవని. ఒకేళ ఈ మాట మీ చెవల్లో పడ్తేగూడా పడుండచ్చు. తిరపతి గంగమ్మ జాతర్ను గూడా ఈ వరసలో చేర్చుకోవాల్సిందే!

తిరపతి గంగమ్మ జాతరంటే ఒక తిరపతికే అనుకుంటే పప్పులో కాలేసినట్టే. అది ఈ జిల్లాకంతా జాతరే! ఊళ్లల్లో మొలగుడ్డా నిలవదు. పైగుడ్డా నిలవదు. ఇంక ఆడోళ్లకంటేనా? కంటి మిందట్టా రెప్పపడ్తే వొట్టు!

సర్కారు జిల్లాల్లో సంకురాంతికి పన్లన్నీ వొబ్బిడై పోతాయి. అదే ఈసీమలో అయితే జాతరొచ్చేకుందికి అన్నీ అరువుళ్లు అయిపోతాయి. అరాకొరా మిగులుణ్ణా జాతరొచ్చేస్తా ఉండాదని నిన్ను బట్టు నన్నుబట్టని బటువు చేసేస్తారు. ఇంక జాతర ఎప్పుడు రాబోతిందా? అని ఎదురుచూస్తా కూసుంటారు. పలానా మంగళారం రేత్రికి అవిలాల్లో చాటింపు అంటే ఆడికే అందురు రడీ అయిపోతారు.

తిరపతిలో జాతరంటే అవిలాల్లో చాటింపా? అదెందుకంటారా?

అవిలాల తిరపతికి దచ్చినంగా మూడుమైళ్ల దూరాన ఉండాది. ఆ ఊళ్లోనే ఆమె పుట్టింది. పెరిగింది. ఆ కన్నె పిల్ల మహా అందగత్తె. అప్పుడు తిరపతిని ఒక పాళేగాడు షాలిస్తా ఉండె. ఈ పిల్లది వాడి కంట్లో పడె. కంటికి దోరగా కనిపించే కుందికి వాడి కన్ను పడె. కన్ను పడేదానికేం వుండాదిలే? ఎర్రంగా బుర్రంగా ఉంటే ఎవుడి కన్నయినా పడ్తింది. కన్ను పడ్తే మాత్రం? చేతిలో పడొద్దా! సరిగ్గా యవ్వారం ఆణ్ణే బెడిసికొట్టింది. కారాల్లోకెల్లా అతికారం గొప్పదంటారు. అది వాడి చేతిలో ఉండాది గదా? చెరబట్టయినా చెర్సాలనుకుణ్ణాడు. శాతగాక పాయ. ఆ కన్నె పిల్లే పాళేగాని మింద పగబట్టింది. కన్నెపిల్లగానే నిలబడిపొయ్యింది. దినానికొక ఏసిం కట్టింది. వాడి అంతు తేల్చుకునింది. దాంతో ఆ మహాతల్లి గంగమ్మ తల్లి అయి కూసుణ్ణింది. ఆ పొద్దుట్నుంచే జనం ఆమెను దేవత మాదిర్తో కొల్చుకుంటా ఉండారు.

అదీకత. అందువల్ల అవిలాల పుట్నిల్లు గదా? ఆడ పొసుపుకుంకం తీసుకోని అవిలాల నుంచి ఎలబారి గంగమ్మ తల్లి తిరపతి చేరుకుంటిందంట!

ఒక మంగళారం అవిలాల్లో చాటింపు అయితే ఆపై మంగళారం తిరపతిలో చాటు.

తిరపతిలో చాటింపంటానే పిలకాయిలు ఉడ్డలు గట్తారు. మొకాల కంత మసి పూసుకుంటారు. నడుంచుట్టా యాపమండలు. ఒక చేత్తో ఒక పాత్ర పట్టుకుంటారు. ఇంకొక చేత్తో యాపమండ పట్టుకుంటారు. 'మంగళారం మలిబిచ్చం... ఓటి కుండ... ఒక పొద్దు!' అని దీర్గాలు తీసుకుంటా యింటింటికీ తిరగతారు.

ఇప్పుడు నేనన బొయ్యేది మీరిన బొయ్యేది యాభైయేండ్ల నాటి కత!

తిరపతిలో చాటింపంటానే మా రామన్న ఎలబార్తాడు. ఏడాది పొడగనా రేత్రిం బొగుళ్లా గొడ్డుమాదిర కష్టపడే మణిసిగదా? జాతరకని ఆయిన ఎలబార్తావుంటే అడ్డం చెప్పే నాదుడే ఉండడు. ఇంక తోకపట్టుకోని నేను!

మిద్దూరు నుంచి తిరపతికి అడ్డదోవలమింద మూడామడ. అంటే ముప్పైమైళ్లు. నడకే పరుగు. అయినాగూడా తెల్సేదికాదు. పాయం మింద ఉండేవాళ్ల కత అట్టా యిడ్సి పెట్టండి. ముసిలీ ముతక! 'వొచ్చే సమ్మత్సరానికి ఉంటామో? పోతామో? అటుమంటి ఏడికిలు చూడాలంటే యిచ్చి పెట్టుకోనుండాల' అంటా పడ్తాలేస్తా వచ్చి జాతర చూడకుండాపోతే మణుసు నిమ్మతి పడదే! సరేలే! ఏడుకొండల ఎంకటేసుడే గాలిగోపరం కాడ కూసోని జాతర చూస్తాడంటే యింక వాళ్లా యీళ్ల కత లెందుకులే? –

నిత్తె కల్యాణం పచ్చ తోరణంగా ఎలిగి పొయ్యే ఎంకటేసుడే జాతర చూస్తా ఉంటే–ఆ జాతర ఎట్టుంటాదబ్బా అంటే? –

మంగళారం నుంచి మల్లా మంగళారందాకా దినానికొక్క ఏసిం. దినానికొక్క ఏడిక. ఒక దినం బండ ఏశాలు. ఒక దినం బైరాగి ఏశాలు. ఒక దినం తోటి ఏశాలు. ఇంకొక దినం దొర ఏశాలు. ఒక దినం మాతంగి ఏశాలు. ఒక దినం సప్పరాలు. ఇంక పులి ఏశాలా? నిజింగా పులులే వాళ్లు. దరువుకు తగినట్టు అడుగేస్తా ఉంటారు. ఆడ్తా ఆడ్తా ఉండి గొర్రె పిల్లనో మేకపిల్లనో నోటితో కర్సుకోని అలాగ్గా ఎత్తి యిసిరట్టా పారేసేవాళ్లు. పులులే గాండ్రించినట్టు గాండ్రిస్తా ఉంటే గుండికాయిలు జారిపాయ్‌నట్టుండేది!

ఈటన్నిటికి మించి ఈది నాటకాలు. ఆ నాలుగ్కాళ్లమండపం కాడ కిష్ణ పరంటాణా కాడ నాలుగీదులు కూడే చోట నిమిశాల్లో టేజీ యేసేస్తారు. నాలుగుదిక్కుల్లో నలుగురు పెట్రమాక్సు లైట్లు నెత్తికెత్తి పెట్టుకోని నిలబడ్తారు. అప్పటికప్పుడే ఏశాలు కట్టుకోని నాటకం ఆడేస్తారు. తాళం... తాళానికి తగినట్టుగా పాట... పాటకు తగినట్టుగా రాగం! చుట్టూరా గుంపు చేరినోళ్లు నోర్లు తెర్సుకోని గదా చూసేది! –

బైరాగి ఏశాలు ఏసుకోని కాశీకి పోతాము రామారీ! గంగ తీర్థంబు తెస్తాము రామారీ! అని గొంతెత్తి పాడ్తా ఉంటే గుండె జల్లుమనేది. అదే తోటి ఏశాలు బండ ఏశాలు కట్టుకోని తిట్టిన తిట్టు తిట్టకుండా తిట్తావుంటే ఆ తిట్లల్లోగూడా కవిత్తం. ఒళ్లు అట్నే జిలపరించేది. ఆ రొండు దినాలు ఆడోళ్లు బయిటికొచ్చే వాళ్లేగాదు.

ఇప్పుడా తిట్లు యింటావుంటే 'ఏందో మోటు యవ్వారం?' అనిపిస్తింది. అయితే ఈ ఆశారం ఎప్పుట్నించి వస్తా వుండేది? ఓయబ్బా! తాత ముత్తాతల కాలం నాటిది. అదొక ఎర్రికాలం. ఏది ఎగవగెనిమ? ఏది దిగవగెనిమ? అని ఎరిగిన బతుకులు. వాళ్లకు బూతు పత్రికలు లేవు. బ్లూ ఫిలిములు లేవు. బూతు సిలమాలు లేవు. అందుకే పెద్దోళ్లు ఆలోచించి 'నోటి తుత్తర తీరేదాకా తిట్టుకోండ్రా!' అని ఆ రొండు దినాలు లైసెన్సు యిచ్చేసినట్టుగా ఉండాది. ఇప్పుడా ఏదికలెక్కితే తిట్లు. అసెంబ్లీలో తిట్లు. పార్లమెంట్లో తిట్లు. ఈ తిట్లముందర జాతరతిట్లు ఒక లెక్కా? పక్కా? ఇప్పుడు జాతర్లో తిట్టుకుంటే లోపల తోసేస్తామని పోలీసోళ్లు బెదిరిస్తా ఉండారు. ఆ మాటకొస్తే ఆ యదవలు నోరు తెరిస్తే కూసే కూతలు!

ఆ ఏడుదినాలు యాడజనం ఈణ్ణే ఉంటారు. ఈళ్లందురికీ గంగమ్మ గుడికాడ ఆ చుట్టుపక్కల యిశాలంగా ఉండే తావే సరిపోతా ఉండేది. గంగమ్మ గుడికి ఎదురుంగా తాతాయిగుంట. ఆ గుంటలో నీళ్లా అవ్వి? టెంకాయి నీళ్లేగదా? ఆ గుంట కట్టమింద కూసోని తెచ్చిన సద్దికూడు మూటలు యిప్పుకోని తింటావుంటే ఈ టవున్లల్లో పోకిరి నాయాండ్లు వాళ్లతో యాసణ్ణంపడ్తా ఏడిపిస్తా ఉంటారు. ఇంక పొగులంతా ఏశాలు చూసుకుంటా ఊరంతా తిరగతారా? రేత్రిపూట యాడ నిద్దరొస్తే ఆడ పొణుకోని నిద్దర పోతావుంటే పిల్లనాయాండ్లు సైగ్గాపాయ్ ఆడోళ్ల పక్కల్లో పొణుకుంటా ఉంటే? – జాతరా అది? ఆ జాతర మజానే మజాగదా?

తిరపతి జాతరకత యిట్టుంటే యింక చుట్టు పక్కల పల్లెల్లో జాతర కత చెప్పేదానికే అలివికాదు. జాతర కంతా పనీ పాట వొబ్బిడై పోతిందా? ఇంక యిది నాపని. అది నీ పని అని అనుకుండే పనేలే. తలా ఒక చెయ్యేస్తారు. నాలుగు చేతులు వొగిటయ్యేకుందికి యింక చూస్కో నా తండ్రీ! ఊరంతా యాపమండల తోరణాలేనా? గెవిన్లో గంగమ్మ గుడికాడ పందిళ్లేనా? పొంగలికి పొట్టేలి పిల్లనో కోడి పిల్లనో సమాళించుకునే వాళ్లేనా? ఎవురి మునాస పకారం వాళ్లు ఏశాలు గట్టేవాళ్లేనా? ఏశాలు గట్టుకోని యింటి ముందిరి కొస్తే ఎనుకూ ముందు చూడకుండా గింజిలు శాటలకెత్తి పెట్టే వాళ్లేనా? ఇంటి పై కప్పు లెగిరి పొయ్యేటట్టు ఏల పదాలేనా? దుమ్ము లేసి పొయ్యేటట్టు అడుగులేనా? – ఇంక ఆడోళ్ల కతల కాడికొస్తే? వాళ్లకు నిల్సిన చోట కాలు నిలవదు. ఇల్లూ వాకిలీ కడుక్కుండే వాళ్లేనా? ఈది పట్టనంత ముగ్గులేసే వాళ్లేనా? పొంగలి గంపలు అలుక్కుండే వాళ్లేనా? కుమ్మర ఎర్రాయిన తావన కుండా చట్టీ కొనుక్కుండే వాళ్లేనా?

ఊరూరు ఒక చిన్న తిరపతి మాదిర్తో సింగారించు కుండేది!

అదెంతా యిప్పుడే మయిపొయ్యింది? నామ్కే వాస్తిగా మిగిలుండాది. మరీ ఆ గంగమ్మ గుడికాడికి పొయ్‌చూస్తే కడుపు అట్నే రగిలిపోతింది. తాతాయిగుంటను ఎండబెట్రి. ఎండిన గుంటలో గుడిసిలు లేసె. గుడిచుట్టూ మిద్దిలు మేడలూ లేసె. ఆ మిద్దిలూ మేడలూ గుడిని మింగతా వుంటే వచ్చే వరుమానం ఎవురు మింగతా ఉండారో ఆ గంగమ్మ తల్లికే ఎరిక! ఆడకూతురు గదా? అయినా పాలేగాణ్ణే చంపిన బిడ్డ. ఈళ్లందుర్నీ ఎట్టిడ్సి పెట్టిందబ్బా? మణిసి తెలివి తేటలు మీరే కుందికి నడతే మారిపోతా ఉండాది. అని ఆలోచించుకుంటా నిలబడుకోనుంటే ముత్తా రెడ్డన్న వచ్చె.

''ఏమిరా అబ్బోడా! ఎండన పడ్తివే?'' అనడిగె.

''ఏం చెయ్‌మంటా వన్నా? ఎండని పాలుమార్తే బతుకు బయిశారి పోతిందంటారే? అయినా ఎండా వాన ఉండే వాడికే గదన్నా? అది సరే. యిదేందన్నా తిరపతి జాతర! మన చిన్నతనంలో...''

యాదాంతి మాదిర ఒక ఎర్రి నవ్వు నవ్వి ముత్తా రెడ్డన్న–

''ఒరే అబ్బోడా! అప్పుడైతే సమ్మత్సరానికి వొగిటే జాతర. ఆ జాతర కోసరం ఎదుర్సూస్తా ఉంటిమి. బెమ్మాండంగా జరుపుకుంటా ఉంటిమి. ఇప్పుడా? పార్లమెంటుకొక జాతర. అసెంబ్లీకొక జాతర. మండలానికొక జాతర. పరిషత్తుల కొక జాతర. పంచాయితీలకొక జాతర. ఇంక మహానాడు మాదిర పార్టీ జాతర్లు? ఇట్టాంటి గంగమ్మ జాతర్లు ఎన్నయితే వాటి కాలిగోటికి సరిపోతాయి? ఇన్ని జాతర్లుండంగా యింకా గంగమ్మ జాతర్ను గురించి తలపోతలెందుకురా పిచ్చోడా?'' – అంటా ఒక పిచ్చినవ్వు నవ్వె.

నిజిమే గదా? యిన్ని జాతర్లు జరుపుకుండే దానికి ఓపికుణ్ణె నా ప్రెజలకు రొండు చేతులెత్తి దణ్ణం పెడ్తి! ●